## కథ

# మమకారం

'కొంపలు మునిగిపోయినట్లు కోడిపుంజులు తెగ కూస్తున్నాయి. ఎవరో పేరంటానికి పిలిచినట్లు వెలుతురు మెల్లగా ముస్తాబవుతోంది. వెలుతురుకు స్వాగతం పలకడానికన్నట్లుగా చెట్లమీద పక్షులన్నీ ఆకాశంలోకి ఎగురుతున్నాయి, పశువుల కొట్టంలో నుండి 'అంబా' అన్న అరుపు వినిపించింది. ఇంట్లో నిద్రపోతున్న పార్వతి ఆ అరుపుకు మంచం మీది నుండి గబుక్కున లేచింది.

కళ్లు నలుపుతూనే తలుపులు తీసి సరాసరి కొట్టంలోనికి వెళ్లి చూసిం ది. ఎదురుగా యెల్లావు. పడుకునే ఉంది. చప్పుడైతే పార్వతి వైపు తలతిప్పి చూసింది. మూతిని ముందుకు సాచి తలను అటూ ఇటూ ఊపింది. ఆవు పక్కనే కూర్చుని ఆమె పరిశీలనగా చూసింది. రెండు డొక్కలూ ఒకదాని కొకటి అతుక్కుపోయాయి, పక్క టెముకలు ఎక్సరే తీసినంత స్పష్టంగా కనిపిస్తున్నాయి, పార్వతి ఆవు వెన్ను మీద చెయ్యి వేసి జాలిగా నిమిరింది. ఆవు మళ్లీ అంబా అని అరిచింది. 'నీళ్లు కానీ తాగుతుందోయేమో!' అను కుంది. వెళ్లి చూస్తే కుండలలో నీళ్లు లేవు. వెంటనే ఇంట్లోకి వెళ్లి బిందె తీసుకుని నీళ్ల కోసం బయలుదేరింది.

అరమైలు నడిస్తే తప్ప చేద బావిని చేరుకోదు. మెల్లగా ఎండలు ముదుర్తు తున్నాయి. అక్కడ కూడా విపరీతమైన రద్దీ! ఒకప్పుడు అన్నీ సమృద్ధిగా దొరికిన ఆగ్రాముంలో నేడు నీళ్ల కోసం నిరీక్షణ! కన్నతల్లి లాంటి ఊరు చెరువు కు గండిపడింది. దానితో ఊరు గుండెకే గండిపడినట్లయ్యింది. అదే నేటి అవస్థ కు ప్రధాన కారణం! మధ్యలో దళారీ ఒకడు ప్రవేశించి, మరమ్మత్తుకు ప్రభు త్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని చెప్పి చెరువు కింద భూమి ఉన్న అందరి దగ్గర డబ్బు వసూలు చేశాడు. చెరువు మరమ్మత్తు కోసం గవర్నమెంటు ఆర్డరు చేతిలో లేకుండా మళ్లీ ఊళ్లో అడుగుపెట్టనని శపథం చేసి మరీ వెళ్లాడు.

రెండేళ్లు గడిచాయి. ఎప్పుడూ పచ్చని పంటలతో కనిపించే భూములు నేడు ఎడారిలాగా మారి పోయాయి. దళారి కల్పించిన ఆశమాత్రం కొంత కాలం ఎండమావిలా ఊరించింది. అది దింపుడు కళ్లెం ఆశేనని తెలియడానికి వాళ్లకెంతోకాలం పట్టలేదు. అప్పటి నుండి మెల్లగా ఊరు నుండి వలస మొదలయ్యింది. తల్లిని, పక్షవాతం వచ్చిన తండ్రిని వదిలి కొడుకు పెళ్లాన్ని తీసుకుని బతకడానికి పట్నం వెళ్లాడు. కొడుకు పేరు జ్ఞాపకం రాగానే పార్వతికి కోపం వచ్చింది. కన్న కొడుకావాడు! కటికుడు! పోతూ పోతూ ఆవులన్నిటినీ అంగట్లో అమ్ముకుని మరీ వెళ్లాడు. కొనేవాడుంటే తల్లిదండ్రుల్ని కూడా అమ్మేవాడే. యెల్లావొక్కటే వాడి నుంచి తప్పించుకుని ఇంటికి వచ్చింది. యెల్లావు! ఎసొంటి ఆవు! మేత సరిగా ఉంటే ఎంత బాగుండేది! రాత్రి రాజన్న చెప్పిండి. పక్కూరి అవతలి ఊర్లో పొలం కోతకు వెలుతున్నరట! 'నువ్వు కూడా రా అక్కా' అన్నాడు. పోవాలి! తొందర గా పోవాలి. పార్వతి నడక వేగం పెంచిం ది. రాజన్న రైతులకు, కూలీలకు మధ్య సంధానకర్త. అందరినీ పోగేసి నాట్లు, కలుపులు, కోతలకు తీసుకుని వెళుతుంటాడు. అందరితోపాటు అతనూ పనిచేస్తాడు. వచ్చిన సొమ్ము ను అందరికీ సమానంగా పంచుతాడు.

అయిదు మైళ్ల దూరముంటుంది ఆ ఊరు. ఎప్పుడెప్పుడు వెళదామా అని పార్వతి ఉబలాటపడుతోంది. అక్కడికి వెళ్లడం వల్ల ఆమెకు రెండు పనులు కలిసివస్తాయి. అక్కడ పశువుల ఆసుపత్రి ఉంది. ఎప్పుడో వెళ్లినప్పుడు పశువుల డాక్టరు యెల్లావు కు మందులు వ్రాసిచ్చాడు. అవి కొనుక్కోవచ్చు. పైగా భర్త వాడే మందులు కూడా తెచ్చు కోవచ్చు. నాలుగు రోజుల నుండి యెల్లావు నీళ్ళు, మేత ముట్టడం లేదు. లేచి నిలబడ లేకపోతుంది. మందులు తెస్తేనన్నా అది మామూలుగా మేస్తుందని పార్వతి ఆశిస్తోంది. చేతిలో పైస ఉంటే ఈ వైద్యం ఎప్పుడో చేయించేది. చెరువుకు గండిపడిన నాటి నుండి ఊరు రూపే మారి పోయింది. వయసులో ఉన్నవాళ్లే ఊరు వదిలిపోతున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ పూట గడవ డమే కష్టమైపోతోంది. మనుషులకే తిండి దొరకటం లేదు. ఇంక గొడ్డుకేడ బెడతవ్ పార్వతక్కా అంటాడు రాజ న్న. యెల్లావు గొడ్డా! కాదు నా బిడ్డ! నా కొడుకు గాడ్డికొడుకుకు పెద్ద రోగమొస్తే యెల్లావు తొలుసూరి కోడెను అమ్మి నయం చేయించిన! అసొంటిదాన్ని అమ్మడానికి తొలుకెళ్లిండు. వాడికి చేతులెట్ల వచ్చినయో! పార్వతి ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

బావి నుండి నీళ్లు తెచ్చేసరికి ఆమె భర్త శివయ్య లేచి కొట్టంలో కూర్చున్నాడు. శివయ్యకు పక్షవాతం వచ్చి ఒక కాలు, ఒక చెయ్యి పడిపోయింది. కర్ర సహాయంతో బలవంతంగా నడువ గలడు. నెత్తిమీద నుండి నీళ్ల బిందను కిందకు దించింది. ఇంట్లోకి వెళ్లి డబ్బా తెచ్చి ఆవు ముందుపెట్టింది. బిందెలోని నీళ్లు అందులో పోసింది. వాసన చూసింది కానీ ఆవు నీళ్లను తాగలేదు. పార్వతి ఉండబట్టలేక దాని మూతిని నీళ్లల్లో ముంచింది. అయినా అది నీళ్ళు ముట్టలేదు. శివయ్య అటువైపే చూస్తున్నాడు. పార్వతి కళ్లల్లో నీళ్లు. కొంగుతో వాటిని తుడుచు కుంటూ 'నువు మొకం కడుక్కో' అని శివయ్య వైపు తిరిగింది. భర్తకు బలవంతంగా పళ్లు తోమిం చింది. కాళ్లూ, చేతులూ, తువ్వాలుతో తడి లేకుండా తుడిచి పక్కన కూర్చో బెట్టింది.

డబ్బాలో ఉన్న నీళ్లతో యెల్లావు ను శుభ్రంగా కడిగింది. ఇంట్లోకు వెళ్లి పొయ్యి అంటించి బిందె తీసుకొని మళ్లీ నీళ్లకు వెళ్లింది. ఊత కర్రను తన పక్కన పెట్టుకొని ఆవును చూశాడు శివయ్య. తలను ఏ మాత్రం వెనకకు తిప్పలేకపోతోంది. తోక ఊపడానికే తన ప్రాణం తోకకు వచ్చినట్లు ఆయాస పడిపోతోంది. యెల్లావు నెమరువేయక ఎన్నాళ్ల య్యిందో! శివయ్య గతాన్ని నెమరువేసుకున్నాడు. శివయ్య ఆకాలంలో అయిదవ తరగతి వరకు చదువు కున్నాడు. ఆస్తిపాస్తులు అసలే లేవు. మొదటి నుండి రెక్కల కష్టాన్ని నమ్ముకొని బ్రతికాడు. ఎన్నెన్ని కష్టాల లో యెల్లావు తనకు ఆసరా అయ్యిందో, దానికి పదిహేనేళ్లుండొచ్చు. గేదెలకన్నా ఎక్కువగా పాలిచ్చేది. కావడానికి ఆవే అయినా ఎద్దులతో సమానంగా వ్యవసాయ పనులు చేసే ది. దాని మీదికి జతగా నాలుగు ఎడ్లు మారినా అది చెక్కు చెదరలేదు.

ఎత్తులు, వంపులు ఎన్ని వున్నా ఎంత బరువు బండినైనా అవలీలగా ఎత్తి అవతల పడవేసేది. వడ్లు మోయడం, వెంట తోలడం, మోరం పనులు ఒకటేమిటి ఎలాంటి పనిలో నైనా ఎడ్లను మొసలనిచ్చేది కాదు. నాలుగు ఈతల అవైనా ముడ్డిపై ముల్లు పోటును పడనిచ్చేదికాదు. నాలుగేళ్లవుతోంది, చెరువుకు గండిపడి. అయిదెకరాల పొలం అయిదు పైసలకూ అక్కరకు రాకుండాపోయింది.

ఈ కరువు కాలంలో యెల్లావు ముగ్గురి కష్టం అది. బాగుంటే ఎంత బాగుండేది. ఒక్కతి చేసిన పని మీద ముగ్గురం బతకాల్సి వస్తోంది. శివయ్య మనసు చివుక్కుమంది. తిండికీ, మందుల కోసమే తన ఒంటి మీద సొమ్ములన్నీ ఒక్కొక్కటే అమ్మివేసింది. నాలుగేళ్లకి మెడలో మంగళసూత్రం తప్ప మరేమీ మిగలలేదు. ఊళ్లో ఎవరిని చూద్దామన్నా అదే దుర్భర పరిస్థితి. కరువు! ఏం కరువు ఇది! కరువు కూడా క్యాన్సర్ లాంటిదే! అది కూడా జీవులను హింసించి హింసించి మరీ చంపుతంది.

చిటుక్కుమన్న దోమకాటుకు శివయ్య ఆలోచనలు చెదిరాయి. చేతి మీద వాలి దోమ రక్తాన్ని పీలుస్తోంది. యెల్లావు అంబా అని అరిచింది. శివయ్య దోమ వైపు చూశాడు. అది నోరులేని మూగజీవి. అందుకే అంబా అని అరుస్తోంది. నోరు ఉండీ అరవలేని దురవస్థ తనది. శివయ్య



ఎట్టున్నాయి.

'ఏందీ బావా ఏం జేస్తానవ్'

వెనుకకు తల తిప్పి చూశాడు. పక్కింటి వీరయ్య!

ఆవు బావా! ఆవు! అటు చూడు ఎలాంటి ఆవు ఎట్లాయ్యింది.

ఆవు సంగతి అటుబెట్టు. సరి నువ్వో! ఏపాంటి పని ఎట్లయినవ్. ఎన్ని కష్టాలు పడ్డావో ఎంత మంది కష్టాలల్లో ఉన్నోళ్లకు సాయపడ్డావో! నేనైతే అనుకోలేదు బావా! నీకు గిట్ల కాలు చెయ్యి పడిపోతదని అన్నాడు వీరయ్య. వీరయ్య శివయ్యలవి పక్క పక్క ఇళ్లు. ఎన్నో ఇబ్బందుల్లో వీరయ్యను ఆదుకున్నాడు శివయ్య. అయినా మన పిచ్చిగాని అనుకున్నట్టు అనుకున్నట్లయితే అది బతు కెట్లయితది బావా? వీరయ్యే అన్నాడు మళ్లీ.

నా ఇంత అందువుగాని. పార్వతి శివయ్యను ద్వేశించు అంది. ఎప్పుడు వచ్చిందో ఇంట్లోకి ఆలోచనల్లో పడి ఆమెను చూడలేదనుకున్నాడు శివయ్య. ఏం పార్వతక్కా! పొద్దుగాల, పొద్దుగాలనే బావకు తిండి పెడతానవ్ ఎక్కడికి పోతానవ్ అడిగాడు వీరయ్య. 'పని కోతలకన్నా' భర్తను ఇంట్లోకి నడిపిస్తూనే బదులిచ్చింది పార్వతి. పక్క ఊరిలో పొలాలు కోత కొచ్చా యట. మేతకు లేక ఇంట్లో ఆవు కోత కొచ్చింది' తనలో తానే గొణుక్కున్నాడు శివయ్య. తనను పీట మీద కూర్చోబెట్టి పళ్లెం కడుగుతోంది పార్వతి. ఇంట్లో ఏమీలేదని తెలిసినా 'ఏం జేసినవేంటి' అని అడిగేడు. కొన్ని నూకలుంటె జావగాసిన' బదులిచ్చింది పార్వతి. భూమ్మీద నూకలు చెల్లేంత వరకూ, నూకలో, జావో ఏదో ఒక దానితో కడుపు నింపుకోవాల్సిందే. మళ్లీ తనలో తానే అనుకున్నాడు.

పార్వతి పళ్లెంలో జావపోసి భర్త నోటికి అందించింది. భర్త తాగుతుంటే అతని గురించి ఆలోచించసాగింది. ఇప్పటి వరకూ కష్టాల్లో సుఖాల్లో ఒకరి కొకరుగా ఉన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్పుడు అతను ఖాళీగా కూర్చోవడం ఆమె చూడలేదు. అయిదెకరాలకు యజమానివి ఇంకా పొలంలో పని చేయడమేంటి శివయ్యా అని ఎంత మంది అన్నా వినిపించుకునే వాడు కాదు. నలుగురు చేసే పనిని ఒక్కడే చేసేవాడు. నువ్వు లాగవా అన్న మాటకు పార్వతి జావతాగడం మొదలెట్టింది.

ఇల్లు సర్ది, భర్తను వీరయ్య కమ్మరి కొలిమి దగ్గర కూర్చోబెట్టి ఆవు జాగ్రత్త అంటూ కొడవలి తీసుకుని కోతకు వెళ్లింది. అక్కడ కూర్చుంటే కొట్టంలోని ఆవు స్పష్టంగా కనిపిస్తుంది. కొడుకులు లేరని ఇన్నాళ్లు బాధపడే వాడిని కానీ నీ కొడుకును చూశాక కొడుకులు లేకపోవడమే మంచిదనిపిస్తోంది బావా అన్నాడు వీర య్య. కొడుకులుంటే చస్తే తల కొరివి పెడతారటగా. చచ్చినోడికెవడికి తన కొడుకు తలకొరివి పెట్టింది లేనిది తెలియదు. కానీ నీ కొడుకు మాత్రం బతికి ఉండగానే కొరివి పెట్టిపోయాడు. వీరయ్య కత్తిసాన పడుతూ తన భాషలో మాట్లాడుతూపోతున్నాడు. శివయ్య కు కొడుకు జ్ఞాపకం వచ్చాడు. ఒక్క కొడుకుని ఒళ్లో పెట్టుకుని పెంచారు. అన్నీ ఇంట్లో ఉన్నప్పుడు ఎంతో ఆప్యా యత కనబర్చిన కొడుకు కరువు మొదలు కాగానే ఇంట్లో తమ మీద కసురుకోవడం ప్రారంభించాడు. తన కు పక్షవాతం రాగానే భార్యతో సహా పట్నం వెళ్లిపోయాడు. కష్టాలు నిజంగా మనిషి వ్యక్తిత్వానికి గీటురాళ్లే! జీవితం లో వాటికి స్థానమే గనుకలేకపోయి నట్లయితే ప్రతి మనిషి పరమ పవిత్రు డుగా కనిపించే ప్రమాదముండేది. ఆవు అంబా అని అరిచింది. శివయ్య తను కొట్టంలోకి చూశాడు. అరవలేక అరవ లేక అరిచినట్లుందా అరుపు!

ఎక్కడి పార్వతి! ఎక్కడి తను, ఎక్కడి యెల్లావు. శివయ్యకు తను పెళ్లినాటి కొత్తరోజులు గుర్తుకు వచ్చాయి. యెల్లావును కొన్న రోజులు గుర్తుకు వచ్చాయి. కలిసిపడిన కష్టాలూ, ఆనందమయ జీవితం అన్నీ గుర్తొ చ్చాయి. ఆవు! యెల్లావు ఆవా? కాదు అది నా అవ్వ లాంటిది! శివయ్య మనసు ప్రేమతో నిండిపోయింది. తనకు వయసు మీద పడుతోంది. ఊరికి దూరమవుతున్నాడు, కాటికి దగ్గర వుతున్నాడు. యెల్లావు కూడా మేతకు దూరమై కోతకు దగ్గరవుతోంది. జీవితం నిజంగా జీవించ డానికే జీవిస్తూ అన్నింటినీ భరించడానికి. శివయ్య ఆలోచనలు వేదాంత ధోరణిలో సాగు తున్నాయి. ఆవు మరొక్కసారి అంబా అని అరిచింది. అరుపు కాదది -ఆర్తి . కర్రను భూమికి ఆన్చి మెల్లగా లేచాడు. శివయ్య. కొట్టం వైపుపోతున్న శివయ్యను అనుసరించాడు వీరయ్య.


"పిన్నిగారూ! ఈ దెబ్బతో మా అదృష్టం తిరగబడిపోయింది. ఇక నుంచి మా ఇంట్లో కార్లు, టి.వి., ఫ్రిజ్‌లు అబ్బబ్బ!" ఆనందం పట్టలేక చెబుతోంది రమణి రెండు రూపాయలు పెట్టి అప్పుడే కొన్న కోటి రూపాయల లాటరీ టికెట్ చూపిస్తూ.

పని పూర్తికాగానే పార్వతి పొలం గట్ల మీది పచ్చగడ్డిని గబగబా కోసి మోపు కట్టింది. వస్తూ వస్తూ ఊళ్లో యెల్లావుకు డాక్టరు రాసిన మందులు, భర్త వాడే మందులు కూడా తీసు కుంది. గడ్డిమోపుని నెత్తిన పెట్టుకుని ఇంటికి నడక ప్రారంభించింది. కడుపు న పుట్టిన వాళ్లకన్నా వాళ్లను వదిలి పోతున్న ఈ కాలంలో ఏంది పార్వ తక్కా ఆవు కోసం నువ్వు ఇంత అవస్థ పడుతానవ్ అన్నాడు రాజన్న. ఆమె ఆ మాటలు విన్నది. కానీ బదులివ్వలేదు. ఆమె ఆలోచనలన్నీ యెల్లావు మీదే! ఆవు మళ్లీ నెమరు వేయాలి. అది మునుపటిలాగా నడవాలి. భర్తకు మళ్లీ కాలూ, చెయ్యీ రావట. అతనిని జాగ్రత్తగా కాపాడుకోవాలి! ఆవును బతికించు కోవాలి అదీ ఆమె ఆలోచన. పార్వతి నడక వేగం పెంచింది. దాదాపుగా ఇంటి దగ్గరకు వచ్చేసింది. అడుగు ముందుకు పడుతున్న కొద్దీ ఎవరివో అస్పష్టమైన మాటలు వినిపిస్తున్నాయి. అడుగులు మరింత వడివడిగా వేసింది. ఇంకా కొంచెం దగ్గరగా వచ్చేసరికి ఇంటి నిండా జనం. పరుగెత్తినట్లుగా వచ్చి ఇంటిని చేరింది. అందరూ ఆమెకు అడ్డుతగిలారు. వీరయ్య విచారంగా పార్వతివైపు చూశాడు. శివయ్య తల వంచుకుని కూర్చున్నాడు. ఎదురుగా యెల్లావు చచ్చిపడి ఉంది. పార్వతి గడ్డిమోపును పక్కన పడవేసింది. గాలివానకు నేలకూలిన వటవృక్షంలా యెల్లావు మీద పడిపోయింది. తన ముఖాన్ని ఆవు మూతిపై పెట్టింది. దాని శరీరంపైబడి అటూ ఇటూ పొర్లు తూ ఏడ్చింది. ఎండిన డొక్కలపై తల పెట్టి వెక్కి వెక్కి ఏడ్చింది. ఆవును మోసుకపోవడానికి అప్పటికే కాళ్లకు కట్లు కట్టారు. కట్లను చూసేసరికి ఆమెకు దుఃఖం కట్టలు తెంచుకుంది. 'అయ్యో బిడ్డా! మమ్ముల్నిలనాగం చేసి పోయినవా' అంటూ బావురు మంది. ఆమె ఏడుపుకు అక్కడున్న వాళ్లంతా చలించిపోయారు.

శివయ్య తల ఎత్తి చూశాడు పార్వతి మెడలో వట్టి పసుపుతాడు. మందులు తేవడానికి ఎక్కడో మంగళ సూత్రం తాకట్టు పెట్టినట్టుంది. శివయ్యకు గుండెనెవరో పిండుతున్న ట్లనిపించింది. అది గొడ్డే! మనకు చాకిరీ చేసింది. తీరా దాని రుణంతీర్చుకోక ముందే తనువు చాలించింది. శివయ్య మనసు కకా వికలైంది. ఇప్పటికే ఆలస్య మైంది కానివ్వండి! కానివ్వండి! వీరయ్య అక్కడున్న వాళ్లను తొందరపెట్టాడు. ఆవును మోసేవాళ్లు కాళ్ల మధ్య కర్రవేసి పైకి లేపారు. ఒక్క ఉదుటున లేచి పార్వతి మళ్లీ ఆవు మీద పడి పోయింది. ఇద్దరు వ్యక్తులు ఆమెను ఆవు నుండి బలవంతంగా వేరు చేశారు. అయినా పార్వతి రోదిస్తూనే ఉంది. ఆమె కళ్ల నుండి నీళ్లు రాలి భూమి మీద పడుతు న్నాయి. భూమాతలాగే శివయ్య కూడా కన్నీళ్లను దిగమింగుకుంటున్నాడు. ●